క్లుప్తంగా

వరదనీటిని తరలించే ఏర్పాట్లు చేయాలి

సుభాష్‌నగర్: అంటు వ్యాధులు ప్రబలకుండా పేరుకుపోయిన చెత్తను తరలించి డ్రైనేజీ లైన్లను శుభ్రం చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. ఆదివారం గాజులరామారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జంట సర్కిళ్లల్లోని అనేక ప్రాంతాల్లోని రోడ్లపై వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయని, దీంతో ప్రజలు రోగాల బారిన ప్రమాదం పొంచి ఉందన్నారు. అధికారులు ఈ విషయమై స్పందించి స్పెషల్ డ్రైవ్ ద్వారా చెత్తను తరలించడంతో పాటు నిల్వ ఉన్న వరదనీటిని తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. నాయకులు లాల్ మహమ్మద్, కాంగ్రెస్ యువ నాయకులు దండే సతీష్, దండే రాజు, రాజ్‌కుమార్, ఉమేష్ పాల్గొన్నారు.

రాంబాబుకు డాక్టరేట్

నిజాంపేట్: నాసిక చిత్రకారుడు, సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సంస్థ నిర్వాహకుడు సత్యవోలు రాంబాబుకు ఏసియా వేదిక్ రిసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆదివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏషియా వేదిక్ కల్చర్ ఫౌండేషన్, శ్రీరామ కృష్ణవేణి సేవ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాసిక చిత్ర లేఖనంతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్న రాంబాబు సేవలకు గాను అవిశ్రాంత హైకోర్టు జడ్జి చంద్రయ్య చేతుల మీదుగా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఏషియా వేదిక్ రీసెర్చ్ యూనివర్సిటీ ప్రతినిధి మార్గరెట్ అముల్, సౌత్ ఇండియా హోం గార్డ్స్ ప్రెసిడెంట్ కొత్వాల్ దయానంద్, నాగర్ కర్నూలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

దుండిగల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ చెప్పారు. వరద నివారణ చర్యలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిలువ ఉన్న వర్షపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, యాంటీ లార్వా మందును పిచికారి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా ఆస్తిపన్ను వసూలు విషయంపై రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. సకాలంలో పన్నులు వసూలు చేయాలని సూచించారు.

రెరా చైర్మన్‌కు శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మున్సిపల్ ఉప కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన సత్యనారాయణను రాష్ట్ర ప్రభుత్వం రెరా చైర్మన్‌గా నియమించింది. ఆదివారం కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన నిషాని చందర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉప కమిషనర్‌గా కుత్బుల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి సత్యనారాయణ ఎంతో కృషి చేశారని అన్నారు.

కాలనీ సంక్షేమ సంఘాలకు పూర్తి సహకారం

సుభాష్‌నగర్: బస్తీలు, కాలనీ సంక్షేమ సంఘాలకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. ఆదివారం హెచ్‌ఏఎల్ కాలనీ నార్త్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా సుబ్బారాయుడు, జనరల్ సెక్రెటరీ జీ. ఎస్.వి. ప్రసాద్, కేవీవీ బంగార్రాజులతో కూడిన నూతన కమిటీని కార్పొరేటర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో మొక్కలను నాటి ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. సంక్షేమ సంఘం సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, శివ సాయి, లక్ష్మీనారాయణ, రామకృష్ణారాజు, శ్రీశైలంయాదవ్, చంద్రశేఖర్, కార్తీక్, రాజేష్, ఎలమందరావు, రవి ప్రకాష్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రసూల్ నాయక్, ప్రభు, రామకృష్ణారావు, శశిధరన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం


ఇమాన్యుయేల్ (ఫైల్)

జీడిమెట్ల: మతిస్థిమితం సరిగా లేని ఓ వృద్ధుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి తప్పిపోయిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన నాయకల ఇమాన్యుయేల్(75)కు కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. దీంతో అతను ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ నెల 23వ తేదీన రోజు మాదిరిగానే మధ్యాహ్నం 3గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో ఇమాన్యుయేల్ భార్య నాగమణి జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తొట్టెల ఊరేగింపులో భక్తజన సందోహం




అమ్మవారి ఆలయానికి బోనాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులు

బోనంతో బైలెల్లి..
అమ్మకు ప్రణమిల్లి






కాళికామాత వేషధారణలో కళాకారులు

నిజాంపేట్: బాచుపల్లిలోని అమ్మవారి బోనాల ఉత్సవాలు ఆదివారం అంబరాన్నంటాయి. తెల్లవారుజాము నుంచే మహిళల బోనాలు ఎత్తుకుని ఇంటి నుంచి బైలెల్లారు. అమ్మవారికి నీటి సాక పెట్టి బోనాలు సమర్పించారు. భక్తులతో ఆలయ ప్రాంగణం భక్తులతో జన సంద్రమైంది. మధ్యాహ్నం ఆలయానికి భక్తులు భారీ తొట్టెలను ఆడుతూ తీసుకొచ్చారు. అదే విధంగా సాయంత్రం పలహారం బండ్ల ఊరేగింపు యువతలో జోష్ నింపింది. పోతరాజులు తీన్మార్ చప్పుడుకి అదిరిపోయే స్టెప్పులు వేశారు. కళాకారులు కాళికమాత, కాంతారా వేషధారణలో ఆకట్టుకున్నారు. బాచుపల్లి కమ్యూనిటీహాల్ నుంచి ఆలయం వరకు కొనసాగిన అమ్మవారి పలహారబండి ఊరేగింపు సాగింది. ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మేయర్ నీలారెడ్డి, కాసాని విరేశ్ ముదిరాజ్, టీపీసీసీ ప్రతినిధి కొలను హన్మంత్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్లు ఆగం పాండు, కాసాని సుధాకర్, కొలను వీరేందర్ రెడ్డి, ఆగం రాజు, దివాకర్, సురేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.




ఫలహారబండి ఊరేగింపులో కాసాని వీరేశ్, కార్పొరేటర్లు సుధాకర్, ఆగం పాండు


బోనాల వేడుకలో ఎమ్మెల్యే వివేకానంద, మేయర్ నీలారెడ్డి


బాచుపల్లిలోని కమ్యూనిటీహాల్ వద్ద తొట్టెల ఊరేగింపు

దోమల నియంత్రణకు జీహెచ్‌ఎంసీ శ్రీకారం


సీజనల్, అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తున్న సిబ్బంది

జగద్గిరిగుట్ట: దోమల నియంత్రణకు జీహెచ్‌ఎంసీ శ్రీకారం చుట్టింది. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు 'ప్రతి ఆదివారం 10 గంటలకు 10 నిమిషాలు 10 వారాల పాటు'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం జగద్గిరిగుట్టలోని పలు కాలనీలలో ఎంటమాలజిస్ట్ ఏఈ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి అవగాహన కార్యక్రమం చేపట్టారు. సీజనల్, అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఇంట్లో పనికి రాని వస్తువులలో, డ్రమ్ములలో, కుండీలలో, కూలర్లలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. యాంటీ లార్వా పునరావృతం కాకుండా వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలు స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన వివరాలతో కూడిన స్టిక్కర్లను గోడలకు అంటించారు. ఈ కార్యక్రమంలో ఈఎఫ్ఏ మల్లేష్, ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌టీయూను భారీ మెజారిటీతో గెలిపించాలి


ఎంటీఏఆర్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

చింతల్: ఏ ఒక్క కార్మికుడికి అన్యాయం జరిగినా సహించేది లేదని మల్కాజిగిరి పార్లమెంట్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గాంధీనగర్ పారిశ్రామికవాడలో ఉన్న ఎంటీఏఆర్ టెక్నాలజీస్ కంపెనీ యూనియన్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఎంటీఏఆర్ గ్రూప్ ఆఫ్ ఎంప్లాయీస్ యూనియన్ తరుపున బీఆర్‌టీయూ అనుబంధ సంస్థ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. పరిశ్రమలో జరిగే ఎన్నికల్లో బీఆర్‌టీయూ ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్మికుల పక్షాన కొట్లాడేందుకు మేనేజ్‌మెంట్ తలలు వంచి కార్మికుల హక్కుల సాధన ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. ఆగస్టు 3వ తేదీన జరిగే ఎన్నికల్లో బీఆర్‌టీయూను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికశాఖ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, రాష్ట్ర కనీస వేతన బోర్డ్ చైర్మన్ నారాయణ, చింతల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు మొహమ్మద్ రఫీ, ఎంటీఏఆర్ బీఆర్‌టీయూ యూనియన్ ప్రధాన కార్యదర్శి, రాజయ్య, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, ఈఎస్ఐ బోర్డ్ సభ్యుడు రమణారెడ్డి, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రధాని 'మన్ కీ బాత్'తో విలువైన సందేశాన్ని ఇస్తున్నారు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ నాయకులు

రంగారెడ్డినగర్: 'మన్ కీ బాత్'కార్యక్రమం ద్వారా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ దేశ ప్రజలకు విలువైన సందేశాన్ని ఇస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏర్వ వెంకటరమణ నివాసంలో 'మన్ కీ బాత్'ప్రత్యక్ష ప్రసారాన్ని శ్రీశైలంగౌడ్ స్థానిక బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రధాని మనసులో మాటలు వ్యక్తం చేస్తూ దేశాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కేంద్రం చేస్తున్న పనులను వివరించారు. నాయకులు గరిగే శేఖర్ ముదిరాజ్, జగన్ మోహన్‌రావు, మోతే శ్రీనివాస్‌యాదవ్, రామచందర్‌రావు, రమేష్ మంజుల్కర్, బండారు నారాయణ, జూల సందీప్, రమణయ్య, సుధాకర్, షాకీర్, కొండయ్య, తోకల శీను, నవాజ్, చోటు, అశోక్, రత్తయ్య, బాషా శ్రీకాంత్, హర్ష, రాకేష్, శ్రవణ్, సాయినాథ్, ప్రేమ్ కుమార్, మారుతి, కోవా శ్రీనివాసరెడ్డి, శ్రవణ్ కుమార్, ప్రకాష్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో వైఎస్సార్‌టీపీ జెండా ఎగరడం ఖాయం


షాపూర్‌నగర్ చౌరస్తాలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

కుత్బుల్లాపూర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వైఎస్సార్‌టీపీ జెండా ఎగరడం ఖాయమని పార్టీ నాయకుడు సాతాల గోపాల్ అన్నారు. ఆదివారం షాపూర్‌నగర్ చౌరస్తాలోని నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పార్టీని పటిష్ట పరిచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య ఉన్న అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు ముందుంటామని అన్నారు. తెలంగాణ అభివృద్ధి వైఎస్ షర్మిలతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ అభివృద్ధిని భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమైనా ఎవరూ పట్టించుకోవడంలేదని అన్నారు. కేవలం ఫొటోలకు ఫోజులివ్వడం వారి పనిగా మారిందన్నారు. గాజులరామారం డివిజన్‌లోని ఒక్షిత ఎన్‌క్లేవ్ వాసులు గత రెండు వారాల నుంచి వరద నీటిలో కాలం వెళ్లదీస్తున్నా శాశ్వత పరిష్కారం చూపడంలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని మండిపడ్డారు. నాయకులు ఎస్.శ్రీను, విజయ్, అలాం, జోన సామిల్, అజిత్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధి


ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజుకు సమస్యలను నివేదిస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి సమస్యలను ఏకరువు పెట్టారు. వాటిపై స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి చొరవ తీసుకున్నారు. బౌరంపేట గ్రామంలో నెలకొన్న సమస్యలపై గ్రామస్తులు, కౌన్సిలర్లతో ఆయన కలిసి సమీక్ష నిర్వహించి స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. అదే విధంగా నిజాంపేట పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సుపరిపాలన అందించే దిశగా ముందుకెళ్తున్నాం


బ్యాంక్ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, అధికారులు

కుత్బుల్లాపూర్: ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా ఆదివారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా రూ.కోటి నిధులతో స్థానికంగా చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసకుంటున్నామని అన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్నామని పేర్కొన్నారు. జలమండలి డీజీఎం రాజేష్, మేనేజర్ శివప్రసాద్, ఇంజినీరింగ్ సెక్షన్ ఏఈ సురేందర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్దిరాములు, సంపత్ మాధవ్‌రెడ్డి, గుమ్మడి మధుసూదన్‌రాజు, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, సమ్మయ్య నేత, కాలే నగేష్, కాలనీ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే మైనంపల్లి



సుభాష్‌నగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అంజత్ భాషా షేక్ బెపారిని ఆదివారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం దూలపల్లిలోని ఆయన నివాసానికి ఆహ్వానించి అంజత్‌బాషా శాలువతో సత్కరించారు. దూలపల్లి పీఏసీఎస్ చైర్మన్ గరిసె నరేందర్‌రాజు ఈ సందర్భంగా తెలంగాణలోనే ఆదర్శంగా నిలిచిన దూలపల్లి సహకార బ్యాంక్ అభివృద్ధి గురించి ఆయనకు వివరించారు.

వరుస సెలవులు వస్తే అంతే..

కబ్జాలు, అక్రమ నిర్మాణాల జోరు


రింగ్ బస్తీలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం


కూనా మహాలక్ష్మినగర్, వార్డు కార్యాలయానికి సమీపంలో..


శ్రీనివాస్‌నగర్ ప్రధాన రహదారిలో..


మగ్దూంనగర్ ప్రధాన రహదారిలో..

జగద్గిరిగుట్ట: వరస సెలవులు వస్తే కబ్జాదారులకు.. నిర్మాణదారులకు హద్దు అదుపు లేకుండాపోతోంది. మొహర్రం, ఆదివారం వరుసగా సెలవులు రావడంతో విజృంభించిపోయారు. ఇదే అదునుగా భావించి కబ్జాల కోసం కొందరు ప్రయత్నించగా.. మరో వైపు అనుమతి లేకుండానే ఫ్లోర్ పైన ఫ్లోర్లు వేసేశారు.

ఇక్కడ కబ్జాలు...

- రింగ్ బస్తీలో సుమారు 60 గజాలు కబ్జా చేస్తూ చుట్టూ కవర్ చుట్టారు. ఇక అందులో రెండు రోజులలో ఓ గది నిర్మాణం చేపట్టడానికి సిద్ధమయ్యారు.
- కూనా మహాలక్ష్మినగర్, వార్డు కార్యాలయానికి సమీపంలో ఇటీవలే ఓ డబ్బా వేశారు. ఇప్పుడు దానికి ఆనుకొని రేకులు అమర్చి, తడకడలతో పై కప్పు వేసి నిర్మాణానికి సిద్ధం చేస్తున్నారు.

అధికారుల నిఘా ఎక్కడ..?

డివిజన్ పరిదిలో అనుమతి లేని భవనాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈ విషయమై 'సాక్షి'లో ప్రచురించినా, అధికారులు నోటీసులు ఇచ్చామని తెలిపినా ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో యథావిధిగా షిరిడీ హిల్స్, మగ్దూంనగర్, శ్రీనివాసనగర్, సోమయ్యనగర్, మైసమ్మనగర్ తదితర కాలనీలలో అనుమతి లేని భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

- శ్రీనివాస్‌నగర్ ప్రధాన రహదారి రోడ్ నం.14లో మూడు అంతస్తులతో నిర్మాణం చేపడుతున్నారు.
- మగ్దూంనగర్ ప్రధాన రహదారిలో సెల్లార్‌తో పాటు ఇప్పటికే మూడు ఫ్లోర్లు వేశారు.
- అధికారులు ఇప్పటికైన చర్యలు తీసుకొని కబ్జాలు, అనుమతి లేని భవనాలను అదుపు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.